


# నారింజా సమ్మర్ స్కూల్

నాది ఫోర్త్ ఫారం పరీక్షలు కూడా అయిపోయాయి.

సెలవులయ్యాక ఫిప్తు ఫారంలో చేరడమే. అంటే ఒక్కసారి కూడా ఫస్టు రాకుండానే స్కూలు చదువంతా అయిపోతోంది. నిరుడంటే సెలవల్లో చచ్చేలా పని చెయ్యడం నేర్చుకున్నాం. ఇప్పుడయితే పెద్దయిపోతున్నాం కదా! ఇంకా చిన్న చిన్న పనులు నేర్చుకుంటున్నా వంటే ఎవరన్నా నవ్వుతారు కూడా! అమ్మక్కూడా నా మీద

ఎంత నమ్మకం వచ్చేసిందంటే సాయంత్రాలు కూర మాడకుండా కలపడం, పచ్చడి నూరడం లాంటివి నాకే వదిలేస్తోంది. చిన్నారికేమో కంచాలు పెట్టడం, వంటిల్లు కడగడం, ఇందూకీ బుజ్జీకి పొద్దున్నే పక్కలెత్తడం దుప్పట్లు మడత పెట్టడం లాంటి చిన్న చిన్న డ్యూటీలు. నే వాళ్లంతున్నప్పుడు నాచేత ఎంత పెద్ద పనులు చేయించేదో!

ఎవరయినా ఇంటికి పెద్ద ఆడపిల్లగా పుట్టకూడదు బాబూ ఒకటే పన్లు అని నేనను కుంటుంటే విని ఏవందో తెల్సా ''నీకేవే ! వున్నవీ మన్నవీ పెట్టి పెద్ద పిల్లవని బాగానే సాగనంపు తాం. ఎవరూ కూడా చివరాడపిల్లగా పుట్టకూడదు. పెద్ద కోడలిగా మెట్టకూడదూ!'' అని ఎదురు నాకే పెద్ద పాఠం చదివింది. సర్లే ఇప్పట్నించీ మళ్లీ జన్మలో ఎలా పుట్టకూడదో ఆలోచించుకోడం దేనికని అప్పటి కూరుకున్నాను.

మళ్లీ సీజను మొదలైంది కదా - ఇంక రెండు మూడ్నెల్లవరకూ నాన్న కంటపడనే పడరు. అందులో ఇది ఆఖరి సంవత్సరం. ఇంకో అయిదారు నెలల్లో రోడ్డు బ్రిడ్జి తెరిచేస్తారట. ఇంట్లో కూచుని కూచుని విసిగెత్తిపోతుందేమో ! ఎంతసేపని వేళ్ళు వాచేలా చింత గింజలాడతాం! గొంతరిగి పోయేలా పాటలు పాడతాం ! ఏదో ఒకటి అనువైన పని ఎంచుకోబోతే ఈ సెలవల్లోంచి ప్రాణాలతో బయట పడలేవేమోనని భయం పట్టుకుంది.

ఏవీ తోచక నేనూ చిన్నారీ నారింజ చెట్టు కిందకి చేరాం. అప్పటికే భాగ్యమ్మా వాళ్లూ అక్కడ కూచున్నారు. చెట్టు మీదన్నీ నారింజ పళ్లే. అన్నీ మావిడ పండు రంగులోకి మారిపోతున్నాయి. వూరంతా ఎంత ఎండగా వున్నా ఆ చెట్టుకింద మాత్రం చల్లగా వుంటుంది. గచ్చుకూడా వేడెక్కదేవిటో. ఒక్కోళ్లు ఒకో కొమ్మనాదనుకుని లెఖ్ఖ పెడితే అయిదు వందల కాయలు తేలాయి.

చిన్నారంది ''సుశీలా ! స్కూలు కెళ్లకుండా ఇంట్లో వుండాలంటే నావల్ల కావట్లేదు. మనం ఈ చెట్టుకిందే కూచుని స్కూలు కొచ్చాం అనుకుని ఒకళ్ల కొచ్చినవి ఇంకోళ్లకి నేర్పుదాం. మనం అందరం కలిస్తే ఏడుగురం వున్నాం కదా !''

''ఛీ! ఏం బాగుంటుంది. ఈ బుజ్జికేం వచ్చు ఏడవడం తప్ప. ఇంత బతుకూ బతికి దీని దగ్గిరేం నేర్చుకుంటానూ ! పోనీ పంకజవన్నా అయితే పాటలు నేర్చుకోవచ్చు'' అని దాని మాట తీసి పారేశాను.

అప్పుడు భాగ్యం ''కాదోయ్! చిన్నారి చెప్పింది పాపం బాగానే వుంది. కాకపోతే ఇంకోలా చేద్దాం. స్కూలంటే రాజ భవనంలో పెట్టక్కర్లే కదా. ఈ నారింజ చెట్టుకిందే స్కూలు పెడదాం. మనందరం టీచర్లుగా ఉందాం. వీధిలో తిరిగి కాస్తమంది పిల్లల్ని పోగేస్తే ఈ రెండు నెలలూ స్కూలు నడుపుకోవచ్చు. బుజ్జిని కూడా స్టూడెంట్‌గా తీసుకుంటే సరి''

అని అంది.

''అవుననుకో! మనకి లెఖ్ఖలవీ బాగా వచ్చని మనకి తెలుసుగానీ తప్పులు చెప్తావని అమ్మలు భయపడతారేమో కదా ! సెలవల్లో భూగోళం విజ్ఞాన శాస్త్రం నేర్పుతావంటే పిల్లలకి ఏం నచ్చుతుందీ'' అన్నా. అయినా పన్నెండు నుంచీ నాలుగు వరకూ పిల్లల్నాడించి పెడతావంటే ఏ అమ్మలు ఒప్పుకోరూ ? హాయిగా వాళ్లని తోలేసి నిద్దరోవచ్చునని అనుకుంటారు కదా. సాయంత్రం అమ్మా అత్తయ్యగారూ పెరట్లోకొచ్చే వరకూ మేం అలా మాట్లాడుకుంటూనే వున్నాం స్కూలాట ఎలా ఆడుకోవచ్చా అని.

మా స్కూలు పేరు ''నారింజా సమ్మర్ స్కూల్'' నేను ప్రిన్స్‌పాల్‌ని. చిన్నారి భాగ్యమ్మ హెడ్‌మిస్ట్రెస్సులు ఓ రోజొకళ్లు, మార్నాడొకళ్లు లాగా. ఇంక మిగతా వాళ్లంతా టీచర్లు. బుజ్జి స్కూలు లీడరు. మూడేళ్ల నించీ ఎన్నేళ్ల వాళ్లనయినా చేర్చుకుంటాం. రెండు రూపాయలు ఫీజు. పన్నెండుకల్లా అమ్మలు దిగబెట్టాలి. నాలుగింటికి తీసికెళ్లాలి. ఇదీ మేం నిర్ణయించుకున్నది.

చిన్నారి చేతిరాత బాగుంటుంది కదా. అయిపోయిన నోటు బుక్కుల్లోంచి కాయితాలు చింపి అన్నిటి మీదా చక్కగా రాసింది ''నారింజ సమ్మర్ స్కూల్‌లో చేర్చండి. 12 నుంచి నాలుగు వరకూ మీ పిల్లలకు పద్యములు, పాటలు, ఆటలు, డాన్సులు, ఎక్కములు, డ్రాయింగులు నేర్పబడును. మధ్యలో నారింజ రసం ఇచ్చెదము'' అని. ఒక ఏభై కాయితాలు తయారు చేసింది ఒకేలా అచ్చుగుద్దినట్లు. ఆ పని అయ్యేటప్పటికి రాత్రి చాలా చీకటయి పోయింది.

మర్నాడు పొద్దున్నే నేనూ చిన్నారీ భాగ్యమ్మా అందరిళ్లకీ బయలుదేరాం. భాగ్యమ్మకి పిల్లలున్న ఇళ్లు తెలుసు. బొమ్మల పేరంటానికీ వాటికీ పిలుస్తుంటారు కదా ! స్కూల్లో ఎంత బాగా పాఠాలు చెప్తావో ఎలా వర్ణించి వర్ణించి చెప్పానంటే కొందరమ్మలు అడిగారు కూడానూ. 'మేం కూడా రావచ్చా మీ స్కూలుకీ? జలజ దగ్గిర నాలుగు పాటలు నేర్చుకుంటాం'' అని. మేం ఒప్పుకోలేదనుకో. రెండ్రోజులు అడిగేటప్పటికి పధ్నాలుగు మంది పిల్లల్ని పంపడానికి అమ్మలు దొరికారు. అమ్మని మంచి రోజు చూసి పెట్టవే అంటే మంచి పని చేసేందుకు అన్నీ మంచిరోజులే ఎప్పుడో అప్పుడు మొదలెట్టండంది. ఇంక ఈవిడతో లాభం లేదని అత్తయ్యగారి నడిగితే కాలెండరు చూసి బుధవారం సరస్వతీ దేవికి ప్రీతి ఆ వేళ మొదలెట్టండన్నారు.

ఇంక సెలవులెలా గడిచిపోయాయో నారింజ చెట్టుకే తెలియాలి. టైంటేబుల్ వేసేందుకే రెండ్రోజులు పట్టింది. మరి పిల్లలకి విసుగొస్తే మళ్లీ రారు కదా.

టైం టేబిలు తయారు చెయ్యాలంటే మాటలు కాదు. స్కూలుకి పిల్లలంతా చేరగానే

ముందుగా ప్రార్థన. ఎవరికీ అప్పటి వరకూ తెలియని 'వరలీల గానలోల' అని ఓ పాటని జలజ పాడాలి. అచ్చు మార్చింగ్ సాంగ్‌లా ఉంటుంది. నిద్దరోయే వాళ్లు కూడా లేవాల్సిందే! ఆ తర్వాత మరి నేను ప్రిన్సిపాల్‌ని కాబట్టి ''ఈ రోజు మాట'' అని ఎక్కడెక్కడో పెద్దవాళ్లు చెప్పినవి తీసుకొచ్చి వాళ్లకి చెప్పాలి. మళ్లీ వార్తలు చదివి వినిపించాలి. సినిమా వార్తలు మాత్రం చదవకూడదు.

మొదటి క్లాసు భాగ్యమ్మ నోటి లెక్కలు - ఎక్కాలు. కాస్తో కూస్తో చదువు లాంటిది ముందయిపోతే మంచిది కదా. లెఖ్ఖలయి పోయాక చిన్నారి తెలుగు క్లాసు. దానిష్టం ఏదయినా చెప్పచ్చు. వేమన శతకం, కృష్ణశతకం పద్యాలో, పొడుపు కథలో, చందమామ కథలో దాని క్లాసు విషయంలో ఎంత ప్రిన్స్‌పాల్‌నైనా నోరెత్తేందుకు లేదు కదా.

చిన్నారి క్లాసయిపోయాక ఇంటర్వెల్లు. పిల్లలకి నారింజ రసం అప్పుడివ్వాలి. రోజుకి ఆరు కాయలు కోసేందుకొప్పుకున్నారత్తయ్య గారు. ఆవిడ చిన్న గ్లాసుడు పంచదారిస్తే ఆ తీపి చాలక పిల్లలంతా ఒకటే ఏడుపు. మాకొద్దు బాబోయ్ ఈ రసం అని. మర్నాడు నించీ పెద్ద గ్లాసు పంచదార రెండు చెంచాల ఉప్పు ఇచ్చేరనుకో. గ్లాసులు నాలుగు రకాలవీ నాలుగు ఇచ్చింది అమ్మ. కొలత తెలియక చచ్చే విసుగొచ్చేది. కొలత ప్రకారం ఇవ్వచ్చుగానీ పెద్దగ్లాసులో ఆడుక్కి కాస్త కనిపిస్తే పిల్లలూరుకుంటారేవిటీ రెండ్రూపాయలు ఫీజిచ్చాక ! అందుకని ఒక గ్లాసే కడిగీ ఒకళ్ల తరువాత ఒకళ్ల కివ్వాలి. ఎంత టైము పట్టినా !

ఇంటర్వెల్లయ్యాక... మళ్లీ క్లాసు. చరిత్ర క్లాసు చెప్తావన్న మాట. అంటే మామూలు నిజం. చరిత్ర కాదు. పెద్ద పెద్ద చక్రవర్తులు అంటే శిబి, బలి, ధర్మరాజు, హరిశ్చంద్రుడు ఇలాంటి వాళ్ల కథలు. ఆ క్లాసుకి నే నేర్చుకుని చెప్పాలి. వచ్చింది చెప్పడం వేరు, నేర్చుకుని చెప్పడం వేరు కదా ! ఇంక చివరికి ఇందు, పంకజ వాళ్లకి డాన్సులు నేర్పే పని. క్లాసు మధ్యలో భరతమాతని నించోబెట్టి, ప్రతి డాన్సుకీ ఆవిడుండాలి కదా మధ్యలో. ఇంకా క్లాసయిపోయాక ఆటలు అమ్మలొచ్చి తీసుకెళ్లే దాకా.

ఎక్కడ అమ్మలు గేటు తోసుకుని లోపలి కొచ్చేసి మావయ్యగారిని మా పిల్ల లెక్కడ అని అడిగేస్తారేమోనని మాకు చచ్చే భయం. అందుకని ఇందూ పంకజం నాలుగయ్యే టప్పటికి గుమ్మంలో నిలబడి ఎవరి అమ్మలు కనిపిస్తుంటే ఆ పిల్లల్ని తీసుకొచ్చి వాళ్లకప్ప చెప్పేస్తారు. మధ్యాహ్నాలు పిల్లలు బడి కొచ్చినప్పుడు కూడా అంతే. వీధి గేటు దగ్గిరే వాళ్లనప్ప జెప్పుకుని సందులోంచి నెమ్మదిగా తీసుకొచ్చి పెరట్లో వదిలేస్తారు.

మా బడి నడపడం మొదలు పెట్టి నెల్లాళ్లయినా మావయ్యగారికి చీమ కుట్టినంత అనుమానం కూడా రాలేదు. ఎలా వస్తుందీ ? పదకొండు గంటలకి మావయ్యగారు పెరుగూ

అన్నంలో వుండగానే అత్తయ్యగారు హాలు కిటికీలకి కమ్మగా తడిపిన వట్టివేళ్ల తడికలు దింపేసి, ఫానేసేసి ఆయనకో చాపా దిండూ ఇచ్చేసి హాలంతా చీకటి చీకటిగా అమర్చుతారు గదా. ఆవిడ వంట తిని ఆ హాల్లో నేలమీద దిండేసుకు పడుకుంటే ఇంక ఎవరన్నా నాలుగు లోపల లేవగలరేవిటి ? ఇంక పిల్లలూ పెద్దలూ అంతా సందులోంచో మా వాటా లోంచో మసలాల్సిందే.

స్కూలు మొదలెట్టాక ఒక్క పిల్లకూడా ఒక్క రోజు కూడా మానలేదు. పైపెచ్చు కొన్ని రోజులు ఇరవయ్యేసి మందయి పోతున్నారు. మరి వేసం కాలం సెలవులని చెప్పి కొందరికి అత్తయ్యల పిల్లలూ, పిన్నిల పిల్లలూ వచ్చేస్తారు కదా ! అలా ఎవరన్నా వచ్చినా మేం మళ్లీ ఎక్కువ డబ్బులు తీసుకోనే తీసుకోం. చుట్టాలని డబ్బడక్కూడదు కదా.

ఈవేళ చిన్నారిది పొడుపు కథలూ - సామెతలూ క్లాసవుతోంది. దానికి పాఠం చెప్పడం మాత్రం భలేగా వచ్చు. చచ్చేలా చదివీ చదివీ చెప్తుంది కదా. నేనూ భాగ్యమ్మా రసం తీస్తూ కూడా పాఠం వింటున్నాం దానికి తెలియకుండా వుండేట్లుగానే. ఇంతలోకీ ధడాలున వంటిల్లు తలుపు తీసుకుని మావయ్యగారొచ్చారు. మేం ఎక్కడ వాళ్లం అక్కడుండి పోయాం గుండెలాగి నట్లయి పోయి !

''ఎవరి పిల్లలు వీళ్లూ ! ఏవిటి భాగ్యం ఏం చేస్తున్నారు?'' భాగ్యానికి నోట్లోంచి మాటొస్తేగా! మా నాన్న కాదుగా అందుకని ధైర్యంగా నేనే చెప్పా !

''లేదు మావయ్యగారూ ! పిల్లలెండలో ఆడకుండా ఓ చోట కూచోబెట్టి లెఖ్ఖలూ, పద్యాలూ అవీ నేర్పిస్తున్నాం!''

''జలజేం చేస్తోందీ! దాన్ని నాలుగు గీతాలు నేర్పమను వీళ్లకి. వచ్చిన వాళ్లకి వస్తాయి. వుత్త లెఖ్ఖలు చెయ్యడం వస్తే ఏం లాభం !'' అంటూ దొడ్లోది ఓ తువ్వాలు తడిపి భుజానేసు కుని వెళ్లిపోయారు.

ఆహా ! ఇంక ఒకటే గెంతులు. మేం ఉత్తుత్తినే భయపడ్డాం గానీ మంచి పనులు చేస్తే ఆయన మాత్రం ఎందుకు కోప్పడతారు ? సెలవు లిచ్చారు కదాని కళ్లూ నోరూ చెవులూ అన్నీ కుట్టేసుకోలేం అని ఆయనకి తెలియదేవిటీ !